

నేడు ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ నెల 23వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాధుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం ద్వారా చేపట్టనున్నటు పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ నెల 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.



పొట్టేలు ధర రూ. 1.36 లక్షలు

కోసిగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కయ్యానికి కాలుదువ్వేలా ఉన్న ఈ పొట్టేలు ధర అక్షరాలా లక్షా ముప్పై ఆరు వేల రూపాయలు. కోసిగి చెందిన చింతలగేని నర్సారెడ్డి అనే వ్యక్తి కోసిగిలో జరిగే దేవర కోసం కర్ణాటక రాష్ట్రం భాగల్‌కోటకు వెళ్లి అక్కడి సంతలో రూ.1.36 లక్షలు వెచ్చించి ఈ పొట్టేలును కొనుగోలు చేశాడు. భారీ ధర పలికిన ఈ పొట్టేలును చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.



రూ.1.36 లక్షలకు పొట్టేలును కొనుగోలు చేసిన కోసిగి వ్యక్తి చింతలగేని నర్సారెడ్డి

వలస పక్షుల సందడి

ఆహార అన్వేషణలో
వలస పక్షులు
పల్లె పల్లెల్లో
పచ్చని పంట పొలాల్లో
కిలకిల రావాలతో
కనువిందు చేసిన
కొంగల గుంపు
నువ్వా నేనా అంటూ
పోటీ పడుతూ
పైపైకి ఎగురుతూ
ఆహ్లాదకర వాతావరణంలో
స్వేచ్ఛగా విహరిస్తూ
సేదదీరుతూ
ఆహారాన్ని అన్వేషిస్తూ
సందడి చేసిన
శ్వేతవర్ణ పక్షులు


-చాగలమర్రి/ రుద్రవరం (ఆంధ్రజ్యోతి)



చాగలమర్రి: శెట్టివీడు గ్రామ సమీపంలోని జొన్న పంటలో ఆహారాన్ని అన్వేషిస్తున్న కొంగలు



రుద్రవరం: లింగందిన్నె గ్రామ సమీపంలోని పొలాల్లో సందడి చేస్తున్న వలస పక్షులు



కోసిగి మండలంలో ముళ్ల పొదలతో ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్

కాలువలు ఇలా నీరు పారేదెలా..?

- వైసీపీ హయాంలో కాలువలను గాలికొదిలేశారు
- మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రావడంతో నిర్వహణపై దృష్టి
- పీఎంకేఎస్‌వై, ప్రపంచ బ్యాంక్ నిధుల కోసం ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లాలో 6.56 లక్షల ఎకరాల ఆయకట్టు
- మరమ్మతులకు అవసరమైన నిధుల అంచనా రూ.1,558 కోట్లు
- అస్తవ్యస్తంగా టీబీపీ ఎల్లెల్సీ, కేసీ కెనాల్, తెలుగుగంగ, జీడీపీ పంట కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు

సాగునీరు ఆయకట్టుకు చేరాలి.. పుట్టకొలది ధాన్యం పండాలి.. రైతు ఇంట సిరులు కురవాలి.. అప్పుడే కదా కష్టజీవుల మోమున దరహాసం కనిపించేది. పంటలు పండాలంటే పొలాల్లోకి నీటి పారుదల రావాలి. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం అన్నదాతల జీవనాడులైన ప్రాజెక్టులు, పంట కాలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటర్లు, కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. ముళ్ల పొదలతో నిండిపోయాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. మట్టి మనుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో కాలువ నిర్వహణ, మరమ్మతులపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికలు ముగియ డంతో ప్రపంచ బ్యాంక్ నిధులు వచ్చే అవకాశం ఉంది. కాల్వలు అభివృద్ధి చెందుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6.56 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిచాల్సిన తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, జీడీపీ కాలువ దుస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల వద్ద డీపీ-80 పంట కాలువ దుస్థితి

కర్నూలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, కర్నూలు-కడప (కేసీ) కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్సార్బీసీ) ప్రధాన సాగు, తాగునీటి వనరులు ఉన్నాయి. ఆయా కాలువ పరిధిలో 6.30 లక్షల ఎకరాలకు సాగు నీరు, వివిధ గ్రామాలకు తాగు నీరు అందించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాకు రాయలసీమ జిల్లాకు సాగు నీరు అందించే జలవనరుల హబ్‌గా ఉంది. అయితే.. దశాబ్దాలుగా కాలువ మరమ్మతులపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు నిధులతో కొంత వరకు తాత్కాలిక మరమ్మతులు చేసింది. 2019లో జగన్ సారథ్యంలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కాలువలు, ప్రాజెక్టు నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. పొలాలకు నీరుపారుదల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు శిథిలావస్థకు చేరాయి. పలు ప్రాంతాల్లో పూడిక, ముళ్ల పొదలు, జమ్ముతో నిండిపోయాయి. నీళ్లు రాకపోవడంతో కాలువలను రైతులు పూడ్చేసిన పల్లెసీమలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు కావడం రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీలు, కాలువలు ఆధునికీకరణకు ప్రపంచ బ్యాంకు నిధులు ఇవ్వాలంటే సాగునీటి ఎన్నికలు జరపాలి, తొమ్మిదేళ్ల తరువాత టీడీపీ ప్రభుత్వం నీటి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసింది, డబ్ల్యూయూఏ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ), ప్రాజెక్టు కమిటీ (పీసీ)లకు పాలకవర్గాలను ఎన్నుకున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఆయకట్టుకు జీవనాడులైన కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు ఆధునికీకరణ, మరమ్మతులకు ఆయా నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.



రుద్రవరం సమీపంలో కోతకు గురైన తెలుగుగంగ కాలువ 20 బ్లాక్ చానల్

పీఎంకేఎస్‌వై, ప్రపంచ బ్యాంకు నిధులపై ఆశలు

ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), ప్రపంచ బ్యాంక్ నిధులతో కాలువల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయమని ఇప్పటికే జలవనరుల శాఖ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పీఎంకేఎస్‌వై రిపేర్స్-రెనోవేషన్-రిస్టోరేషన్ (ఆర్ఆర్ఆర్)లో భాగంగా మేజర్, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువలు, సిస్టమ్ ట్యాంకులు శాశ్వత మరమ్మతులు, ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు తయరు చేయమని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు (గైడ్‌లైన్స్) కూడా రూపొందించారు. 2012-16 మధ్యలో పీఎంకేఎస్‌వై-ట్రిపుల్ ఆర్ కింద జిల్లాకు రూ.21 కోట్ల నిధులు మంజూరైతే రూ.12 కోట్లు మాత్రమే ఖర్చు చేశాం. అప్పుడు మైనర్ ఇగిరేషన్ చెరువులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు. తాజాగా తాగునీటి అవసరాలు తీర్చే మేజరు ప్రాజెక్టులు కూడా ట్రిపుల్‌ఆర్ కింద చేర్చడం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కాలువలు, ప్రాజెక్టులు, చెరువులు ఆధునికీకరణ, పునర్నిర్మాణం చేసేందుకు అవకాశం ఏర్పడిందని ఓ ఇంజనీరు పేర్కొన్నారు. అదే క్రమంలో కాలువల మరమ్మతులకు ఒక్కో డబ్ల్యూయూఏకు ప్రపంచ బ్యాంకు నిధులు సరాసరి రూ.20 లక్షలు ఖర్చు చేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు అంటున్నారు. కాలువలకు జలజీవం రావాలంటే డబ్ల్యూయూఏ, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిధులు.. నీళ్ల కోసం పోరాడి రైతుల నమ్మకాన్ని నిలబెడుతారా..? అలంకార ప్రాయంతగా మారుతారా..? అన్నది తేలలాంటే వేచి చూడాల్సిందే.

మిగతా 7లో..



ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు వద్ద అసంపూర్తిగా టీబీపీ ఎల్లెల్సీ లైనింగ్ పనులు

'ప్రతివారం ఒక నాటకం'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'చంద్రన్న వరం ప్రతివారం ఒక నాటకం' పేరుతో రాష్ట్రంలోని రంగస్థల కళాకారులు ప్రతి శనివారం ఒక నాటకం ప్రదర్శించేలా చేసి వారిని ఆదుకుంటామని ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఉమ్మడి జిల్లా రంగస్థల కళాకారుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఏపీ నాటక అకాడ మీలో ప్రతి రిజిస్టరు కళాసంస్థ తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి దశల వారీగా ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి కళాకారుడికి పింఛన్, ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. మహిళా కళాకారులకు ఆర్థిక సాయం అందించే ప్రణాళికలు రూపొం దిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షు డు పత్తి ఓబులయ్య, కళాకారుల సంఘం అధ్య క్షుడు మహాలింగప్ప, జిల్లా రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్య క్షుడు పి.దస్తగిరి, విశ్వకళా స మితి అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, హరికథ కళాకారిణి మం జుల, రంగం సంస్థ రాష్ట్ర అధ్యక్షు డు కరుణాకర్, సీనియర్ కళాకారులు వీవీ రమణారెడ్డి, ఖాదర్ బా బు తదితరులు ఛైర్మన్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు.



కళాకారులతో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్, పక్కన ఎమ్మెల్యేలు

నిరసన స్వరం

- రాయల్టీ సమస్యపై అధికార పక్షం పోరాటం
- వైసీపీ నేతల మౌనం
- నాపరాళ్ల పరిశ్రమను సంక్షభంలోకి నెట్టింది వైసీపీనే..
- అందుకే నోరు మెదపలేకపోతున్నారనే విమర్శలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పన్నులు పెంచినా, ప్రజలపై భారం మోపే నిర్ణయాలు తీసుకున్నా మొదటగా స్పందించాల్సింది ప్రతిపక్షం. ప్రజల పక్షాన గొంతెత్తి సమస్య ఎదుర్కొంటున్న వర్గాలకు అండగా నిలవాలి. అయితే బనగానపల్లె నియోజకవర్గంలో మాత్రం అంతుకు భిన్నంగా జరుగుతోంది. రాయల్టీ సమస్యపై స్పందిచాల్సిన ప్రతిపక్షం మౌనం వహిస్తోంది. మౌనంగా ఉండాల్సిన అధికార పక్షం నేతలు ప్రతిపక్షంగా మారి నాపరాళ్ల పరిశ్రమ వర్గాలకు అండగా నిలుస్తున్నారు. ఇప్పుడిదే అంశం నియోజకవర్గంతోపాటు, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గం గెలుపోటముల్లో కీలక పాత్ర వహించేది నాపరాళ్ల పరిశ్రమ ఓటర్లే. నియోజకవర్గంలో నాపరాళ్ల పరిశ్రమ ఆధారంగా సుమారు 60 వేల జనాభాకు పైగా జీవనం సాగిస్తుంటారు. అందుకే ఎన్నికల సమయంలో సైతం ఆయా రాజకీయ పార్టీలు నాపరాళ్ల పరిశ్రమకు వరాలు ప్రకటిస్తూ హామీలివ్వడం చేస్తుంటారు. ఇంతటి కీలకమైన ప్రజా, కార్మిక సమస్యపై వైసీపీ నేతల మౌనం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ నేతలు, క్యాడర్ మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు జరుపుకోవడానికి చూపించిన ఉత్సాహం రాయల్టీ సమస్యపై స్పందించడానికి లేకపోవడాన్ని రాజకీయ విశ్లేషకులు సైతం తప్పుబడుతున్నారు.

పన్నులు విధించి, ఆంక్షలు పెట్టి..

కుటీర పరిశ్రమ లాంటి నాపరాళ్ల పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టిందే వైసీపీ ప్రభుత్వమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఇంత జరుగుతున్నా వైసీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు నోరు మెదపడం లేదన్న చర్చ సాగుతోంది. 2019 ఎన్నికల్లో సైతం జిల్లా సరిహద్దులోని బందార్లపల్లె రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేస్తామని ఫ్రీగా నాపరాళ్ల రవాణా చేసుకోవచ్చంటూ వైసీపీ నేతలు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తరువాత రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేయకపోగా పరిశ్రమపై అనేక రకాల పన్నులు విధించి, ఆంక్షలు పెట్టారు. బందార్లపల్లె చెక్‌పోస్టుకు అదనంగా కింది భాగంలో అనంతపురం జిల్లాలో మరో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. హెక్టారుకు రూ.52 వేలు ఉన్న ఏడీఆర్(అడ్వాన్స్ డెడ్ రెంట్)కు ప్రీమియం అమౌంట్ కింద 10 రెట్లు (రూ.5.20లక్షలు) చెల్లించేలా నిబంధన తీసుకవచ్చారు. హెక్టారుకు రూ.52వేలుగా ఉన్న ఎస్‌డీ(సెక్యూరిటీ డిపాజిట్) మూడింతలు (రూ.1.56లక్షలు) చెల్లించేలా నిబంధన తీసుకవచ్చారు. ప్రస్తుతం వివాదంగా మారిన కన్సిడరేషన్ ఫీజు జీవో సైతం వైసీపీ ప్రభుత్వం తెచ్చిందే కావడం గమనార్హం. దీంతో పాటు ఈసీ క్లియరెన్స్ వగైరా అంటూ అనేక నిబంధనలు తీసుకవచ్చి నాపరాళ్ల పరిశ్రమను కుదేలు చేశారు. ఈ పరిస్థితుల్లోనే ప్రస్తుత నాపరాళ్ల సమస్యపై వైసీపీ నేతలు మాట్లాడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది.



చెక్‌పోస్టు వద్ద నిరసనలో పాల్గొన్న టీడీపీ నాయకులు వీఆర్ లక్ష్మిరెడ్డి తదితరులు



నిలిచిపోయిన నాపరాయి గని



నాప రాళ్లు లోడ్ చేస్తున్న కార్మికులు (ఫైల్)

భారమంతా మంత్రి బీసీ జనార్దనరెడ్డిపైనే..

ఈ పరిస్థితుల్లో అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం వైసీపీ కన్సిడరేషన్ ఫీజు జీవో అమలు చేయాలని వారం రోజుల క్రితం ప్రయత్నించడంతో సమస్య తీవ్రంగా మారింది. దీంతో మంత్రి బీసీ జనార్దనరెడ్డిపైనే నాపరాళ్ల పరిశ్రమ సమస్య భారం పడింది. దీనికి తోడు తీవ్ర సంక్షోభంలో ఉన్న నాపరాళ్ల పరిశ్రమను ఆదుకుంటామని 2024 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ అధిష్టానం, మంత్రి బీసీ హామీ ఇచ్చారని, సమస్యకు పరిష్కారం చూపాలంటూ పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అయితే వారం రోజులుగా నెలకొన్న నాపరాళ్ల పరిశ్రమ సమస్యపై బనగానపల్లె నియోజకవర్గంలో అధికార పక్షమే ప్రతిపక్షంగా మారి పరిశ్రమ యాజమాన్య, కార్మిక వర్గాలకు అండగా నిలుస్తున్నారు. ఐదు రోజులుగా జిల్లా సరిహద్దులోని బందార్లపల్లె చెక్‌పోస్టు వద్ద నిరసన దీక్షలు, కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అధికార పక్షమైనా, ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరిశ్రమ వర్గాలకు అండగా నిలవడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

అక్రమంగా గోడలు కట్టేశారు..!

- ప్రజలు వెళ్లకుండా నాలుగు దారులను మూసేశారు
- సీసీ రోడ్డును ధ్వసం చేసిన వైనం
- ఆదోనిలో వైసీపీ నాయకుడి బరితెగింపు

సంపన్నుల నివాసం ఉండే ఇళ్ల మధ్యలో స్లమ్ ఏరియా ఉండకూడదని, వారు అటూ ఇటూ తిరగకూడదన్న ఉద్దేశంతో ఏకంగా ఓ వైసీపీ నాయకుడు అడ్డంగా వారం రోజుల క్రితం రాత్రికి రాత్రే గోడలు కట్టేశారు. దర్జాగా మున్సిపల్ ఓపెన్ స్థలంలో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి కాలనీవాసుల రాకపోకల కోసం వేసిన సీసీ రహదారిని ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించారు. ఈ ఘటన ఆదోని పట్టణంలోని మహాత్మాగాంధీ నగర్ సమీపంలోని ఓ ఎస్టేట్‌లో వెలుగులోకి వచ్చింది.


కాలనీవాసుల రాకపోకలకు అడ్డంగా నిర్మించిన ప్రహరీ

ఆదోని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని రైల్వే లైన్ సమీపంలో మహాత్మాగాంధీ నగర్ కాలనీ సమీపంలో ఓ ఎస్టేట్ వెలిసింది. వైసీపీకి చెందిన ఓ నాయకుడు ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దాదాపు 60 సెంట్ల వరకు మున్సిపల్ ఓపెన్ సైట్‌గా ఉంచారు. వైసీపీ నాయకుడు వేసిన ప్లాట్ల స్థలం పక్కన స్లమ్ ఏరియా ఉండటంతో ఆయన ప్లాట్లకు ధర పడిపోతుందన్న నెపంతో ఓపెన్ సైట్‌లో ఆ ప్రాంతవాసులు రాకుండా అడ్డంగా ప్రహరీని నిర్మించేశాడు.


వైసీపీ నాయకుడు ధ్వంసం చేసిన సీసీ రోడ్డు

స్థలం విలువ పెంచుకోవడానికి..

మహాత్మాగాంధీ నగర్‌లోని కాలనీవాసులు కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో చాల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ మాస్ ఏరియా కిందనే గుర్తిస్తున్నారు. వైసీపీ నాయకుడు వేసిన ప్లాట్లకు ధర తగ్గుతుందన్న ఉద్దేశంతో ఇటు వైపు కాలనీవాసులు రాకపోకలు కొనసాగించకుండా ఉంటే తన ప్లాటుకు డిమాండ్ వస్తుందన్న దురుద్దేశంతో నాలుగు చోట్ల వదిలిన రస్తాను మూసివేయించాడు.

రూ.20 లక్షల సీసీ రోడ్డు ధ్వంసం

కాలనీ పక్కన ఆహ్లాదకర వాతావరణం కోసం 60 సెంట్లకు పైగా పార్కు కోసం మున్సిపల్ ఓపెన్ సైటును వదిలారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో ఓపెన్ సైటు పక్కనే 100 అడుగులకు పైగా కాలనీవాసులు రాకపోకలకు సీసీ రహదారిని నిర్మించారు. పది సంవత్సరాల నుంచి కాలనీవాసులు ఆ రహదారి వెంట వెళ్తున్నారు. అయితే వారం రోజుల క్రితం రాత్రికి రాత్రే వైసీపీ నాయకుడు సీసీ రహదారిని ఎక్స్‌కావేటర్ల సహాయంతో ధ్వంసం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని కాలనీవాసులు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ దృష్టికి తీసుకుపోవడంతో అసిస్టెంట్ కమిషనర్ నేరుగా కాలనీలో పర్యటించి ప్రహరీని పరిశీలించారు. దారికి అడ్డంగా నిర్మించిన ప్రహరిని తొలగించి రహదారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలన్నారు. గోడను నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అధికారుల పర్యవేక్షణ తరువాత సీసీ రోడ్డును ధ్వంసం చేశారు.

అధికారం లేకున్నా అదే బరితెగింపు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంతో ఇంతో పనులు చేయించుకున్నారు. అధికారం కోల్పోయి 6నెలలు గడిచిన అదే బరితెగింపు కొనసాగిస్తూ ప్రజల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే పార్థసారధి దృష్టి సారించి ప్రహరిని తొలగించడమే కాకుండా సీసీ రహదారిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని సీసీ రహదారిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీవాసులు వినతి పత్రం ఇచ్చారు

మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాను. కాలనీవాసులు ఇటీవల వినతి పత్రం ఇచ్చారు. రికార్డులను పరిశీలించి విచారిస్తాం. - కృష్ణ, మున్సిపల్ కమిషనర్


ఆందోళన చేస్తున్న కాలనీవాసులు


ధ్వంసం చేయకముందు సీసీ రోడ్డు

కారు, బైకు ఢీ.. ఒకరి మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు

బనగానపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం పసుపుల తండా సమీపంలో మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో పసుపుల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు రహిమాపురం మద్దిలేటి(60) మృతి చెందాడు. మరో ఇద్దరు పారిశుధ్య కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పసుపుల తండా నుంచి ఓ విందు కార్యక్రమంలో పాల్గొని తమ స్వగ్రామం పసుపుల గ్రామానికి మోటారు సైకిల్‌పై రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటిలు బైకుపై వస్తూ పసుపల ప్రధాన రోడ్డుపక్కన ఉన్న గోపాల్‌తో మాట్లాడుతున్నారు. పసుపుల వైపు నుంచి బనగానపల్లెకు వస్తున్న కారు వీరి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో మోటారు సైకిల్‌పై వస్తున్న రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటిలతో పాటు రోడ్డు మీద నిల్చొని ఉన్న గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటి, గోపాల్‌ను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో కోలుకోలేక రహిమాన్‌పురం మద్దిలేటి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ బాలమద్దిలేటి, గోపాల్‌లకు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముగ్గురు పసుపుల గ్రామంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు.

మహిళ మృతి

ఉయ్యాలవాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన గగ్గెర తొలిశమ్మ(42) విషజ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. తొలిశమ్మ గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతోందని, స్థానిక వైద్యశాలలో చికిత్స అందిచినా బాగు కాలేదన్నారు. దీంతో శనివారం నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు తులిశమ్మకు ముగ్గురు కుమారులు, భర్త ఉన్నారు.

కంది రైతులకు గుడ్ న్యూస్

మార్కెట్ ధరకే కొనాలని ప్రభుత్వ నిర్ణయం




మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కంది పంటను సాగు చేసిన రైతులకు సువర్ణ అవకాశం కల్పించింది. బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే అంతే ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 64,270 హెక్టార్ల మేర రైతులు కంది పంటను సాగు చేశారన్నారు. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటిని రైతుల నుంచి ఆ ధరతోనే కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. దీని వల్ల వ్యాపారుల మధ్య పోటీ పెరిగి మరింత ఎక్కువ ధర లభించే అవకాశం ఉందని డీఎం తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు జిల్లాలో 53వేల టన్నుల కందులను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ ప్రయోజనాలను పొందేందుకు రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోకుండా మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోరైతు సేవా కేంద్రాల్లో కంది పంటను సాగు చేసిన రైతులు తమ పంట వివరాలను వెంటనే రైతు సలహా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు గోనెసంచులతో పాటు కొనుగోలు కేంద్రం నుంచి గోదాముకు చేర్చేవరకు రవాణా ఖర్చులు మార్క్‌ఫెడ్ సంస్థనే భరించడం జరుగుతుందన్నారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి కాటా వేయించి లారీకి లోడింగ్ చేయించేంతవరకు మాత్రమే రైతులు ఖర్చులు భరించాల్సి ఉంటుందన్నారు.

కందుల కొనుగోలుకు నిబంధనలు:

- కందుల్లో ఇతర పంట పదార్థాలు 2 శాతం మాత్రమే ఉండాలి.
- పంట గింజలు 3 శాతం
- దెబ్బతిన్న మరియు కొద్దిగా దెబ్బతిన్న గింజలు కూడా 3 శాతం ఉండాలి
- ఇతర తినగలిగిన ధాన్యాలు ఒక్క శాతం
- విరిగిన పొట్టు లేని గింజలు 3 శాతం
- కలుపు పదార్థాలు మూడు శాతం
- తేమ శాతం 12 శాతం
- అపరిపక్వం, ముల్త గింజలు 3 శాతం

పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు

వారంలో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వారం రోజుల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అక్రమాలు జరుగుతున్నాయనీ వీటిని అరికట్టేందుకు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో అంశాలపై ఏకీభవిస్తూ హైకోర్టు జడ్జీలు శనివారం సీసీ కెమెరాల ఏర్పాటు కు ఆదేశాలు జారీ చేయడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 12 కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయడంలో అధికారులు వివిధ మార్గాల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, పత్తి తూకాల్లో తేడా వస్తోందని, ఆ కేంద్రాల వద్ద దళారులు, వ్యాపారులే ఎక్కువగా తిష్ట వేసి పత్తి కొనుగోళ్లను తక్కువ ధరకు వారే నిర్వహిస్తున్నారని రైతులు హైకోర్టుకు విన్నవించారు. హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు తమకు ఇంకా రాలేదని, ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు అందిన వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.


పెంచికలపాడు వద్ద పత్తి కొనుగోలు కేంద్రం

ఇద్దరు అంధులకు వెలుగు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ యోగా సేవా సమితి నిత్యసాధకులు శేగు రామసుబ్బయ్య తల్లి శేగు అనసూయమ్మ ఆదివారం ఉదయం స్వర్గస్తులయ్యారు. రామసుబ్బయ్య వెంటనే స్పందించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీకి ఫోన్ చేసి తన తల్లి శేగు అనసూయమ్మ నేత్రాలను దానం చేశారు. ఈ విషయం వెంటనే రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరికి తెలుపగా కర్నూలు నుంచి టెక్నీషియన్లు వచ్చి రెండు నేత్రాలను తీసుకొని హైదరాబాదు ఎల్వీప్రసాద్ ఐ హాస్పటల్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ యోగా సభ్యులు గత 20 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇప్పుడు ఆర్గాన్ డొనేషన్‌పై దృష్టి పెట్టి ఇప్పటికి 14 మంది చేత నేత్రదానం చేపించి 28 మందికి అంధులకు వెలుగును ప్రసాదించే దిశగా పయనిస్తున్నందుకు గర్వకారణంగా ఉందన్నారు. ఆనంద్‌గురూజీ ప్రతి ఒక్కరూ కూడ శేగు అనసూయమ్మను వారి కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకొని అంధులకు చూపును ప్రసాదించేందుకు తమ వంతుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దస్తగిరి, తిరుమల రెసిడెన్సీ కాలనీ వాసులు, సుబ్బయ్య, రెడ్‌క్రాస్ ఐ టెక్నీషియన్ ప్రదీప్, సిబ్బంది వరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ సిబ్బందికి నేత్రాలను దానం చేస్తున్న శేగు అనసూయమ్మ కుటుంబసభ్యులు

కాలువలు ఇలా.. నీరు పారేదెలా..!?

(5వ పేజీ తరువాయి)

నిధులు.. నీళ్లు.. ఆశలు:

- కర్నూలు జిల్లాలో ఉన్న ఏకైక అదిపెద్ద సాగునీటి ప్రాజెక్టు తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ). ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందించే కరువుపల్లె సీమల జీవనాడి. 1955లో ప్రధాన, పంట కాలువలు నిర్మించారు. ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువలు అధ్వానంగా మారాయి. పలు ప్రాంతాల్లో ఆనవాళ్లు కోల్పోయాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. కాలువను పూర్తి స్థాయిలో మరమ్మతులు, పునర్నిర్మాణం చేయాలంటే రూ.350 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు.
- గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో రబీలో 27,500 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు డోన్, పత్తికొండ, కృష్ణగిరి పట్టణాలు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలి. వేసవి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో కర్నూలు నగరానికి కూడా ఈ ప్రాజెక్టు నుంచే తాగు నీరు అందిస్తారు. ఎమ్మిగనూరు పట్టణానికి నీటి సరఫరాకు పైపులైన్ పనులు ప్రారంభం అయ్యాయి. కోడుమూరు పట్టణానికి కూడా తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. కాలువ ఆధునికీకరణకు దాదాపుగా రూ.75 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు.
- కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జీవనాడి కేసీ కాలువ. మూడు జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంటే.. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1.75 ఎకరాకలు సాగునీరు అందాల్సి ఉంది. కర్నూలు నగరం, నంద్యాల, నందికొట్కూరు పట్టణాలు సహా వివిధ గ్రామాలకు తాగు నీరు ఆధారం. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వంలో సిప్ కింద ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2021లో సిప్ కింద రూ.563 కోట్లు కావలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే.. నిధులు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ఈ నిధుల్లో 85 శాతం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 15 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వం 15 శాతం వాటా నిధులు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం నిధులు ఆగిపోయాయి.


కోసిగి మండలంలో ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్ దుస్థితి

- నంద్యాల జిల్లాలో 1.90 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన ఎస్సార్బీసీ కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో 1.55 లక్షల ఎకరాలకే ఆయకట్టు స్థిరీకరించారు. పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గంలో సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించే ఈ కాలువ మరమ్మతులు, అసంపూర్తి పనులు కోసం రూ.270 కోట్లు కావలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. ఈ మొత్తం పెరిగే అవకావం ఉంది.
- తెలుగుగంగ కాలువ ద్వారా ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆత్మకూరు, నంద్యాల, వెలుగోడు, ఆళ్లగడ్డ పట్టణాలు సహా పలు గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటికే 40 కి.మీలు లైనింగ్ పనులు చేశారు. మరో 45-50 కి.మీలు లైనింగ్, పంట కాలువలు ఆధునీకరణ కోసం దాదాపు రూ.250 కోట్లకు పైగా అవసరం ఉందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

వివిధ ప్రాజెక్టు కింద ఆయకట్టు (లక్షల ఎకరాల్లో), అవసరమైన నిధులు అంచనా సుమారుగా రూ.కోట్లలో

సాగునీటి కాలువ	ఆయకట్టు	కావాల్సిన నిధులు
టీబీపీ ఎల్లెల్సీ	1.51	350
జీడీపీ కాలువలు	0.27	75
కేసీ కాలువ	1.75	563
తెలుగుగంగా కాలువ	1.24	250
ఎస్సార్బీసీ కాలువ	1.55	270
ఆలూరు బ్రాంచి కెనాల్	0.24	50
మొత్తం	6.56 లక్షల ఎకరాలు	రూ.1,558 కోట్లు (అంచనా)

శతాధిక వృద్ధుడి మృతి


సత్యనారాయణ శెట్టి (ఫైల్)

మద్దికెర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్దికెర గ్రామానికి చెందిన మెడికల్ మాకం సత్యనారాయణ శెట్టి (101) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మద్దికెర గ్రామంలో 50 ఏళ్లుగా రాధ మెడికల్ జనరల్ స్టోర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వందేళ్లకు పైగా ఆరోగ్యంగా ఉంటూ జీవనం సాగించాడు. సత్యనారాయణ మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రిటైర్డ్ లైబ్రేరియన్ కె.వీరభద్రరావు, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, టీడీపీ నాయకులు నగిరి కిష్టన్న, గ్రామస్తులు సూర్యప్రకాష్‌రెడ్డి, వన్నాల గోవిందు, ముత్యాల రాజశేఖర్, సుంకు రాజు పూల మాల వేసి నివాళి అర్పించారు.

లారీ దగ్ధం

పాణ్యం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మరాజుపల్లె ఘాట్ రోడ్డులో ఆదివారం తెల్లవారు జామున బేతంచెర్లకు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైనట్లు నంద్యాల అగ్నిమాపక శాఖ అధికారి యోగీశ్వరరెడ్డి తెలిపారు. సమాచారం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశాని చెప్పారు. ప్రమాద సమయంలో డ్రైవర్ మహబూబ్‌బాష ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చైతన్య కుమార్ రెడ్డి, మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీవీ రావు పోరాటం స్ఫూర్తిదాయకం


పీవీ రావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలల సంక్షేమం కోసం దళిత సామాజిక ఉద్యమ నేత, మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు చేసిన పోరాటం తామందరికీ స్ఫూర్తిదాయకమని ఆ సంఘం నాయకులు మల్లె ఎలీషా, శీలం శేషు, మురహరి మల్లయ్య, కేశవులు అన్నారు. ఆదివారం పీవీ రావు 19వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దళిత హక్కుల కోసం, ఐక్యత కోసం పీవీ రావు ఎనలేని పోరాటం చేశారని అన్నారు. దళితులను విచ్చిన చేయాలన్న కుట్రలను అనాడే ప్రతిఘటించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేశారని తెలిపారు. ఆయన ఉద్యమ బాటలోనే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, నరసింహనాయక్, సురేష్, స్వామిదాసు, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

పాములపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం తోడ్పాటు అందిస్తుందని పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రాచారి, కార్యదర్శి చల్లా జయశంకర్‌రెడ్డి, కోశాధికారి అచ్యుతరావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి 15 వేలు, ద్వితీయ బహుమతి 10 వేలు, తృతీయ బహుమతి 5వేలు చొప్పున పూర్వపు విద్యార్థుల సంఘం తరుపున అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుల్లయ్య, ఇస్మాయిల్, మౌళాహుస్సేన్, దేవబూషణం, శ్రీనివాసులు, సాయిక్రిష్ణ, నాగేశన్న పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు విరాళం


సంఘంపెద్దలకు నగదు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

బండిఆత్మకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో 25న జరిగే క్రిస్మస్ వేడుకలకు టీడీపీ నాయకుడు వద్దు మధుసూదన్‌రెడ్డి రూ.10వేల నగదును చర్చి పెద్దలకు అందజేశారు. ఆదివారం ప్రార్థనలో పాల్గొని పెద్దలు ఇజ్రాయల్, శిఖామని, ప్రభుదాస్ హాజరయ్యలకు నగదును అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు సంతోషంగా జరుపుకోవాలన్నారు.

డీఎస్పీని కలిసిన జనసేన పార్టీ నాయకులు


డీఎస్పీని కలిసిన జనసేన నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌ను ఆదివారం స్థానిక జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని డీఎస్పీకి అందజేశారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే ఆత్మకూరు ప్రాంతంలో శాంతిభద్రతలను పర్యవేక్షించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మెట్ల సుధాకర్, జబీవుల్లా, మహెబూబ్, ఖాజాహుసేన్ తదితరులు ఉన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


వెలుగోడు డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వేల్పనూరులోని తన నివాసంలో నియోజకవర్గంలోని 22 మంది లబ్ధిదారులకు రూ.44,58,767 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కావాలో వాటికి ప్రత్యేక చర్యలు ముఖ్యమంత్రి తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరు రామలింగారెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్లాల క్రిష్ణుడు, వెలుగోడు మాజీ సర్పంచ్ కలాం పలువురు నాయకులు పాల్గొన్నారు.

మిడుతూరులో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మిడుతూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా ఏబీఎం చర్చి వద్ద ఉమ్మడి జిల్లా స్థాయి కబడి పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగోవ బహుమతి రూ.5 వేల బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 24 తేదీ 12 గంటలలోపు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

కన్నీటి కష్టాలు..!


నాగటూరు వద్ద ఫేస్ 2 ఎత్తిపోతల నుంచి భారీగా లీకేజీ, నీరంతా నదిలోకే వెళ్తున్న దృశ్యం



బీడు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశాయి. అయితే అధికారులు ఎత్తిపోతల పథకాలను పట్టించుకోకపోవడంతో పొలాలకు నీరు అందించడం లేదు. నందికొట్కూరు నియోజకవర్గంలో పది వేల ఎకరాలకు నీరందించాలని ఆరు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. అయితే వాటి రెండు వేల ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సమస్యల్లో ఎత్తిపోతల పథకాలు
- లక్ష్యం10 వేల ఎకరాలు, పారేది 2 వేల ఎకరాలకే..
- ఎత్తిపోతలలో ఎక్కడ చూసినా భారీగా నీటి వృథా
- అవసరం లేనిచోట డిష్‌ల ఏర్పాటు
- ఆ నీరంతా వాగులు, వంకల పాలు

నందికొట్కూరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలో ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. నాగటూరు ఫేస్1, ఫేస్ 2, జూపాడుబంగ్లా ఫేస్1, ఫేస్2 దాదాపుగా 10 వేల ఎకరాలకు నీరందించాలని ఏర్పాటు చేశారు. కానీ కేవలం 2 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. అలాగే శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల, లింగాల, ఎత్తిపోతల పథకాలన్నిటి పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పథకాలన్నీ గతంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంత వరకు పనిచేశాయి. అయితే వైసీపీ ప్రభుత్వ హయంలో నిధులను మంజూరు చేయలేదు. దీంతో ఎత్తిపోతల పథకాల కింద ఎకరాకు కొంత చొప్పున డబ్బులు వసూలు చేసుకొని నడుపుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరంతా వాగులు వంకలపాలు..

నాగటూరు ఎత్తిపోతల ఫేస్ 1,2ల నుంచి పారే నీటికి నందికొట్కూరు వద్ద కొణిదేల రోడ్డు సమీపంలో పొలాలు లేకున్నా పెద్ద డిష్ నిర్మించారు. దీని ద్వారా నీరంతా వాగులు వంకల పాలవుతోంది. అలాగే సంగమేశ్వరం ఎత్తిపోతల నుంచి వచ్చే నీటికి ముసలి మడుగు వద్ద పొలాలు అంతగా లేకున్నా డిష్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా కూడా నీరంతా వృధాగా పోతోంది.



అవసరం లేని చోట డిష్‌ల ఏర్పాటు

ఎత్తిపోతల పథకాలను అధికారులు, నాయకుల నిర్లక్ష్యం వల్ల పథకాలన్నీ పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎత్తిపోతలకు నీరందించే ఎస్కేప్ ఛానల్‌లో గుర్రపుడెక్క ఆ

నాగటూరు ఎత్తిపోతల ఫేస్ 2 కింద 4900 ఎకరాలకు రెండు పంపులు ఏర్పాటు చేశారు. దీని ఖర్చు రూ.1600 లక్షలు, 72 క్యూసెక్కులు అందించాలి. ఈ పథకం ద్వారా మద్దిగట్ల గ్రామంలో 2వేల ఎకరాలు, నందికొట్కూరు 930 ఎకరాలు, మల్యాల 600 ఎకరాలు, మండ్లెం 1000 ఎకరాలు.తర్తూరు 370 ఎకరాలకు నీరందించాలి. కానీ ఇందులో సగం కూడా నీరందించడంలేదు. నాగటూరు ఎత్తిపోతల పథకం కింద కొన్ని గ్రామాలకే నీరందుతోంది. తర్తూరు. నందికొట్కూరు ప్రాంతంలో ఎక్కువభాగం నీరందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం జూపాడు బంగ్లా ఎత్తిపోతల పథకంలో ఫేస్ 1, ఫేస్ 2 పథకాలు పని చేస్తుండగా, అందులోని మోటార్లు మేజర్ రిపేరు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. అలాగే నాగటూరు ఎత్తిపోతల కింద కూడా ఫేస్ 1, ఫేస్ 2 పథకాలు పని చేస్తున్నాయి. వీటి కింద కూడా దాదాపుగా 9 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కొన్ని ఎకరాలకు మాత్రమే నీరు అందుతుంది. అలాగే సంగమేశ్వరం ఎత్తిపోతల, లింగాల ఎత్తిపోతల పథకాలు కూడా ఇదే తరహాలో ఉన్నాయి.

ఎక్కడ చూసినా సమస్యలే..

కుతో నిండిపోయింది. మోటార్లకు అడ్డుపడుతున్నా అలాగే వదిలేశారు. నాగటూరు ఎత్తిపోతల పథకం ఫేస్ 2 వద్ద నీరు భారీగా లీకేజీ అవుతూ ఆనీరంతా మరలా ఏటిలోకే పోతోంది. కొత్తపల్లె మండలం ముసలి మడుగు వద్ద కూడా సంగమేశ్వరం ఎత్తిపోతల పథకం నీరు కూడా ఎక్కువగా లీకేజీలు అవుతున్నాయి.

కొత్తగా ఎన్నికైన నాయకులపైనే రైతుల ఆశలు

నందికొట్కూరు నియోజకవర్గంలో కొత్తగా ఎన్నికైన నీటి తీరువా చైర్మన్లు, నాయకులపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. నందికొట్కూరు డివిజన్ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి లీకేజీలను అరికట్టాలి. చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కృషి చేయాలి. ఎస్కేప్ ఛానల్ వద్ద గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం మినుము, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదు. గత ప్రభుత్వం పథకాల నిర్వహణ కోసం నిధులు మంజూరు లేదు. ఈ ప్రభుత్వమైనా ఎత్తిపోతల నిర్వహణకు నిధుల మంజూరు చేసి ఆదుకోవాలి. ఇక్కడ పనిచేసే వాచ్‌మెన్‌లకు, ఆపరేటర్లకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎకరాకు కొంత డబ్బు ఇచ్చి పంట పొలాలను తడుపుకుంటున్నారు.

- రాజు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు

చివరి ఆయకట్టుకు నీరందడం లేదు



నందికొట్కూరు పొలిమేరలో నాగటూరు ఎత్తిపోతల పథకం కింద తనకు మూడు ఎకరాల పొలం ఉంది. అయితే పంట పొలానికి నీరు అందడం లేదు. చివరి ఆయకట్టు ఉన్న రైతులందరూ ఇబ్బంది పడుతున్నారు. నీరు పుష్కలంగా ఉన్నా పొలాలకు అందని ద్రాక్షగానే మిగులుతోంది. నందికొట్కూరు, తూర్తురు పొలిమేరలో దాదాపుగా మూడు వేల ఎకరాలకు నీరు అందడంలేదు. ఈ విషయం అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- రైతు సుధాకర్, నందికొట్కూరు


నాగటూరు ఎత్తిపోతల వద్ద ఎస్కేప్ చానల్‌లో పేరుకుపోతున్న గుర్రపు డెక్క


నందికొట్కూరు వద్ద అవసరం లేని చోట ఏర్పాటు చేసిన డిష్

పంట పొలాలకు అందిస్తాం..

పంటపొలాలకు నీరు అందిస్తాం. పథకాలకు నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదు. ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు విడుదల అయిన వెంటనే మరమ్మతులు చేపడుతాం. నాగటూరు ఎత్తిపోతల పథకం రైతుల భాగస్వామ్యంతో నడుపుతున్నాం. ఎకరాకు కొంత మొత్తం రైతుల వద్ద వసూలు చేసి ఇక్కడ పనిచేస్తున్న వాచ్ మెన్, ఆపరేటర్లకు వేతనం ఇస్తున్నాం.

- నారాయణరెడ్డి, నాగటూరు ఎత్తిపోతల ఏఈ

సొంతూరి విద్యార్థుల కోసం రూ.10 లక్షలు విరాళం

జూపాడుబంగ్లా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు రవీంద్రబాబు సొంతూరిలోని పాఠశాలకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో వైద్యుడు ఆయన తండ్రి రామకృష్ణమూర్తి జ్ఞాపకార్థం పాఠశాలలోని భోజనశాలకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం భూమి పూజ చేశారు. వైద్యుడు రవీంద్రబాబు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం మట్టిపై ఎండలో కూర్చొని తింటున్నారని తన దృష్టికి రావడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉన్నతస్థానంలో ఉన్న ప్రతి ఒక్కరు దాతలు ముందుకు రావాలని మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయ బృందం కృష్ణకుమార్, శివణి, విజయలక్ష్మీ, గ్రామపెద్దలు నాగార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, దొరబాబురెడ్డి, సర్పంచ్ అంజనమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


తరిగోపులలో భూమిపూజలో పాల్గొన్న వైద్యుడు రవీంద్రబాబు, సతీమణి సాయివాణి తదితరులు

జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి

నందికొట్కూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కిసాన్ మహసభ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ శివారులోని జగనన్న కాలనీలో సీపీఐఎంఎల్ లిబరేషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కిసాన్ మహసభ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీల్లో నివసించే ప్రజలు రాత్రిపూట విషపురుగులు మధ్య జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయని, రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తాగునీటి ట్యాంకులు పని చేయకపోవడంతో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ లేక నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో నిలిచిపోయిన సీసీ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన గృహాలకు నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే, కమిషనర్‌లు దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు షేక్షావలి, హుస్సేన్‌బాషా, సాములు నాయుడు, మహబాషా, అలీమ్ వెంకటరమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలోని మట్టిరోడ్డును పరిశీలిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


రామానుజన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 22: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం గణితశాస్త్ర కోవిదుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా గణిత పితామహుడు రామానుజన్ చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గణితశాస్త్రం అభివృద్ధికి రామానుజన్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారతదేశమే గర్వించే రీతిలో గణితశాస్త్రంపై పరిశోధనలు చేసి అనేక విజయాలను సాధించిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. 32ఏళ్లలోనే గణితశాస్త్రంలోని సంఖ్యావాదంలో అత్యున్నత పరిశోధనలు సాధించినట్లు గుర్తుచేశారు. ప్రత్యేకించి విద్యార్థులు గణితశాస్త్రం పట్టుసాధించాలని అప్పుడే మేధస్సు పెరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పద్మావతిబాయి, విద్యాసాగర్, డాక్టర్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బదిలీల్లో అందరికీ అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరం వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయుల బదిలీల్లో అందరికీ అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల ఏపీటీఎఫ్ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్వహించే బదిలీలకు మే 31వ తేదీ కటాఫ్‌గా తీసుకోవడంతో 2023జూన్‌లో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, 2017లో బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ప్రస్తుత బదిలీల్లో పాల్గొనే అవకాశం ఉండదని,దీనివల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవాల్సివస్తుందని ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, వీటితోపాటు ఇటీవలే రిటైరైన ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలను కూడా కలుపుకొని భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రంగనాయకులు, జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

నంద్యాలలో కార్డన్ సెర్చ్

నంద్యాల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ , నేరనివారణే లక్ష్యంగా నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. తెల్లవారుజామున సీఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూఆర్టీ టీమ్ సిబ్బంది బృందాలుగా విడిపోయి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనగర్‌నందు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నేర చరిత్ర గలవారు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో సరైన పత్రాల్లేని 13 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

నంద్యాల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మైనర్లు డ్రైవింగ్ చేయరాదంటూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని, మైనర్లు డ్రైవింగ్ చేయరాదని పేర్కొంటూ జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ ఎంవీ ఆక్ట్ గురించి ఆటోడ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున గుప్త మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. యువకులు అత్యుత్సాహంతో, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైనపుడు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని సూచించారు. మైనర్ల డ్రైవింగ్‌లపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 15 మందిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు..

శ్రీశైలంలో భక్తుల రద్దీ


క్యూలైన్‌లో భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం క్షేత్రానికి భక్తు లు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తుల రద్దీతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పటింది. వేకకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదు రుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ అందజేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా సదుపా యాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బం దికి ప్రత్యేక విధులను కేటాయించారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం: శ్రీశైల క్షేత్రంలో ఆదివారం లోకకళ్యాణార్థం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేసి పల్లకీలో ఆశీనులనుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ముమ్మరంగా పూడికతీత పనులు


డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కార్మికులు

కోవెలకుంట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలో ప్రధాన రహదారిలో డ్రైనేజీ కాల్వల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఈవోపీఆర్డీ ప్రకాశ్ నాయుడు ఆదివారం తెలిపారు. పట్టణంలో పలు కాలనీల్లోని డ్రైనేజీ కాల్వల్లో పూడిక మట్టి పేరుకుపోవడంతో మురుగు రోడ్డెక్కి ప్రవహిస్తుందని వీటిని శుభ్రం చేయించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. దాంతో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు.

'ఉపాధి'లో రూ.8.50 లక్షల అవినీతి

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో రూ.8.50 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం ప్రకటించిందని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిన్నవంగలిలో రూ. 28,659, నేలంపాడులో రూ.56,676, డి.వనిపెంటలో రూ.1.31 లక్షలు, బ్రాహ్మణపల్లెలో రూ.42,514, మద్దూరు రూ.55,322, శెట్టివీడు రూ.77,323, పెద్దబోదనం రూ.3,613, కేపీ తండా, రూ.14,342, గొటూరు రూ.14,058, చాగలమర్రి రూ.88,261, రాంపల్లె రూ.8,576, చింతల చెరువు రూ.86,405, ముత్యాలపాడు రూ.85,936, మల్లేవేముల రూ. 30,013, గొడిగనూరు రూ.5,308, పెద్దవంగలి రూ.13,116, కలుగొట్లపల్లె రూ.7,672 ఉపాధి పనుల్లో నిధులు అవినీతి జరిగినట్లు సామాజిక బృందం ప్రకటించిందన్నారు. సొమ్ము రికవరీకి ఆదేశించామన్నారు.

పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య శిబిరాల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమని నంద్యాల జిల్లా వైద్యుల సంఘ అధ్యక్షుడు మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం చాగలమర్రి వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో సుంకు అశ్వత్థామ, అచ్చమ్మగార్ల జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 18 మంది వైద్యులచే 500 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, నరాలు, ఎముకలు, కీళ్ల చెవ్వి, ముక్కు, గొంతు, కంటి పలువురు వైద్య నిపుణులచే వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్య కమిటీ సభ్యులు వైద్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షులు జనార్దన్‌రావు, లక్ష్మణబాబు, ప్రముఖ వైద్యులు, ఆర్యవైశ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లలితా పారాయణం

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో ఆదివారం ధనుర్మాసం, ఏకాదశి సందర్భంగా మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం చేశారు. చెన్నకేశవ, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

డోన్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి రోడ్డు అమ్మహోటల్ సర్కిల్‌లో ఏర్పాటు చేసే భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

స్నేహం.. మధురం

- 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2009-10 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. బెంగుళూరు, హైదారాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవసించారు. ఆలింగనం చేసుకొని ఆనంద బాష్పాలు రాల్చారు. సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరుముడులతో బయలుదేరిన భవానీ స్వాములు

బేతంచెర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేటలో ఉన్న దుర్గమ్మ ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారి మాలధారులకు గురుస్వాములు భవానీ స్వాములకు విజయవాడకు బయలుదేరేందుకు ఇరుముడులను కట్టారు. బేతంచెర్ల నుంచి విజయవాడ కనకదుర్గమకు ఇరుముడులను సమర్పించేందుకు సుమారు 60 మంది భవాని స్వాములు బయలుదేరారు. స్వాములను కుటుంబ సభ్యులు, బంధువులు సాగనంపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

బేతంచెర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రౌడీషీటర్‌లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

డోన్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. అలాగే బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో రామానుజన్ జయంతిని నిర్వహించారు. సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక శ్రీసరస్వతి శిశుమందిరంలో ఆదివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారా దేవాన్ష్ రికార్డు సృష్టించడంపై ఎమ్మెల్యే హర్షం

డోన్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనుమడు నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు సృష్టించిన సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నారా దేవాన్ష్ వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్‌తో ప్రపంచ రికార్డు నెలకొల్పారని ఆయన అన్నారు. వేగంగా పావులు కదపడంలో ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దేవాన్ష్ చోటు పొందడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. నారా దేవాన్ష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

మోక్షమెన్నడో..?

- ఐదేళ్ల వైసీపీ పాలనలో ముందుకు సాగని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- నిధులు లేవంటూ గతంలో కాలయాపన
- కూటమి ప్రభుత్వంలోనైనా లక్ష్యం నెరవేరేనా ?

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవన పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. టీడీపీ హయాంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. శెట్టివీడు, జ్ఞానాపురం గ్రామాల్లో భవన పనులు ప్రారంభించారు. ఒక్కొక్క భవనానికి రూ.7.50 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో పనులు చేపట్టారు. అయితే ఇంత వరకు పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా ఉన్నాయి. ఆ తరువాత ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. గొడిగనూరు గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. బీసీ కాలనీలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. చింతల చెరువు గ్రామంలో రెండు భవనాలు దెబ్బతిన్నాయి. రూ.15 లక్షలు నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలు మూత పడ్డాయి. వెచ్చించిన నిధులు దుర్వినియోగం తప్పా ఎలాంటి ప్రయోజనం లేదు. జ్ఞానాపురం గ్రామంలో స్లాబ్ వరకు వేసి వదిలేశారు. ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలతో చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం చెల్లించే అద్దె కూడా సరిపోకపోవడంతో వర్కర్లు చేతి నుంచి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగిన భవనాలకు బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు పలుమార్లు కోరిన ఫలితం లేకపోయింది. భవన నిర్మాణాల కోసం అధికారులు ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైన ఆగిన భవన పనులకు మోక్షం కల్పిస్తారని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.


జ్ఞానాపురంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

రుద్రవరం మండలం నరసాపురంలో..


నరసాపురంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

రుద్రవరం: మండలంలోని నరసాపురం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నెలలు గడుస్తున్నా భవన పనులు మాత్రం కొనసాగడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎన్నిరోజులు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉంచుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఐసీడీఎస్ శాఖకు అప్పగిస్తే చిన్నపిల్లలకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు తెలిపారు.

డోన్ మండలంలో..


ధర్మవరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

డోన్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. మండలంలోని చిన్న మల్కాపురం గ్రామ శివాలయం సమీపంలో 2018-19లో అప్పటి టీడీపీ హయాంలో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులు సగంలోనే నిలిచిపోయాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాటి పాలకులు పట్టించుకోకపోవడంతో భవనాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. అలాగే మండలంలోని ధర్మవరం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్-1కు సంబంధించిన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దాంతో అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతు న్నాయి. ఇరుకు గదులు కావడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న మల్కాపురం గ్రామంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అవి కూడా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ధర్మవరంలో ఇదే దుస్థితి నెలకొంది. అంగన్‌వాడీలోని చిన్నారులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి కూటమి ప్రభుత్వం సంపూర్తి భవన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణ, విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, గర్జప్ప కోరారు. ఆదివారం బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై చర్చించారు. ఎంఈవో స్వరూప మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలోని అంశాలను వివరించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల గురించి వివరించారు. వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ శనగ తదితర పంటల్లో వచ్చే తెగులు, నివారణోపాయలు వివరించారు. విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, గర్జప్పలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్అండ్‌బీ ఏఈ హుసేన్ మాట్లాడుతూ మండలంలో గుంతలుగా ఉన్న రోడ్లకు ప్యాచింగ్ వర్కులు ముమ్మరంగా జరుగుతున్నాయని త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. త్వరలో రూ.50 కోట్లతో నిర్మించనున్న రింగ్ రోడ్డు పనులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ కొందరు బుక్ కీపర్లు పొదుపు మహిళల వద్ద రుణాలు వస్తే ముడుపులు తీసుకుంటున్నట్లు గుర్తించామని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల మృతి చెందిన తమ్మడపల్లె సర్పంచ్ వెంకటరామిరెడ్డికి ఈవోఆర్డీ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు నిముషాలు సభ్యులు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో ఎంపీడీవో రమణ, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ

తెలుగుగంగ ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే అఖిలప్రియతో తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సంజీవకుమార్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చెన్నారెడ్డిగారి సంజీవ కుమార్‌రెడ్డి పట్టణంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తెలుగుగంగ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో తెలుగుగంగ ప్రాజెక్టును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పీసీ చైర్మన్ సంజీవ కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నారెడ్డిగారి జనార్ధన్‌రెడ్డి(గంగవరం చెరువు అధ్యక్షుడు), చెన్నారెడ్డిగారి అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీపీ :

ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా(ఏపీపీ) నియమితులైన న్యాయవాది బత్తిన శివ ప్రసాదరావు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యేను సన్మానించారు. పేదలకు న్యాయ సేవలు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రమణయ్య, మల్లికార్జునరెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుంలో మంగళవారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని సీఎస్ఐ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ పోటీలు ఉంటాయని, ఆసక్తి కలిగిన క్రీడా జట్లు తమపేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రాక

కొలిమిగుండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి సోమవారం మండలంలోని బందార్లపల్లె చెక్‌పోస్టు వద్దకు రానున్నట్లు టీడీపీ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించారు. చెక్ పోస్టు వద్ద రాయల్టీ సమస్యపై మంత్రి చర్చిస్తారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొలిమిగుండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామానికి చెందిన డ్రైవర్ మారెం తిరుపతయ్య(45) అకస్మాత్తుగా మృతి చెందాడు. పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్టు అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రూ.25వేలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయం


రాజనగరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

శిరివెళ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయమని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ అన్నారు. మండలంలోని గుంప్రమాన్‌దిన్నె మజారా గ్రామమైన రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో తానా, నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు కొనసాగిన వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్ బసవతారకం కేన్సర్ హాస్పిటల్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. తానా, ఎస్ఎస్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్య తెలుగు రాష్ట్రాల్లో విస్తృత సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శృంగవరపు సుబ్రమణ్యం, శృంగవరపు విజయ్ కుమార్, మాలపాటి పుల్లయ్య చౌదరి, వైద్య బృందం పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



ముస్తాబైన సీఎస్ఐ చర్చి

కొలిమిగుండ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలిమిగుండ్ల, బెలుం, కనకాద్రిపల్లె, తిమ్మనాయినిపేట, అబ్దులాపురం, కల్వటాల, తుమ్మలపెంట తదితర గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాలను క్రిస్మస్ వేడుకలకు నిర్వాహకులు ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణతో చర్చిలను అలంకరించారు.

డోన్ రూరల్: పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బైబిల్ మిషన్ ఏవో రేనా బందే రాజు ఆధ్వర్యంలో జరిగిన సెమి క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. సెమి క్రిస్మస్ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం క్యాండిల్ లైటింగ్ సర్వీసు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ సంఘ సేవకులు బి.మణిరాజ్, సభ్యులు దైవవరం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


డోన్ వైఎస్ నగర్‌లో బైబిల్ మిషన్ చర్చి..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉపాధితో చేయూత

- ఏపీవో నిర్మల



చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు, పేదలకు ఆర్థికంగా చేయూత అందిస్తున్నట్లు ఏపీవో నిర్మల అన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పిస్తున్నామని అన్నారు. ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

జవాబు: 19 గ్రామ పంచాయతీలు, 11 మజరా గ్రామాలు ఉన్నాయి.

ప్రశ్న: ఎంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు?

జవాబు: 10 మంది ఉన్నారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?

జవాబు: 9,402 జాబ్‌కార్డులు ఉన్నాయి.

ప్రశ్న: 2023-24 సంవత్సరానికి ఎంత ఖర్చు చేశారు?

జవాబు: రూ.8.70 కోట్లు ఖర్చు చేశాం.

ప్రశ్న: మొత్తం ఎంతమంది కూలీలు ఉన్నారు ?

జవాబు: మండలంలో 2.69 లక్షల మంది కూలీలు ఉన్నారు.

ప్రశ్న: ఒక్కొక్క కూలీ రోజుకు ఎంత డబ్బు సంపాదిస్తున్నాడు?

జవాబు: రూ.248 ఇస్తున్నాం.

పంట బీమా గడువు పొడిగింపు

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేసేందుకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించారని ఏవో రంగనేతాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన శనగ, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పంటలకు ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వం గడువు పెంచిందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శనగ పంటకు ఎకరాకు రూ.84, జొన్న రూ.59, వేరుశనగ రూ.64, మినుము రూ.48, ఉల్లి పంటకు రూ.90, వరి పంటలకు రూ.126 ప్రకారం పంటల బీమా చెల్లించా లని సూచించారు. పంటల బీమా చేయని రైతులు పంటల బీమా చేసుకోవాలని కోరారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె, రుద్ర వరం, చిన్నకంబలూరు గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ, పెద్దమ్మ. సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

లింగమయ్యకు అభిషేకం

రుద్రవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ముత్తలూరు, గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కోటకొండకు చేరిన గంగ నీరు

రుద్రవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ ప్రధాన కాల్వలో రుద్రవరం మండలంలోని కోటకొండ సమీపానికి తెలుగుగంగ నీరు చేరినట్లు ఆదివారం రైతులు తెలిపారు. రెండో విడత తెలుగుగంగ ప్రధాన కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందని అహోబిల కుమ్మర్ల అన్నసత్రం అధ్యక్షుడు రామతీర్థం తెలిపారు. ఆదివారం చాగలమర్రి చెన్నకేశవ ఆలయంలో అహోబిల కుమ్మర్ల అన్నసత్ర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య, కోశాధికారి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి బాలసుబ్బయ్య, హిందూ సంఘ నాయకులు హేమేశ్వర్‌రెడ్డి, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం

బనగానపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో నిర్వహించే హజరత్ మీర్ హుశంవలి, దేహలివాలే సాహెబ్ దర్గా ఉర్సు ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం గంధం ఉత్సవాలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సోమవారం ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గా వద్ద రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బెస్త సంఘం సంక్షేమానికి కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : బెస్త(గంగపుత్రుల) సంఘం సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు అహోబిలం అన్నదాన సంఘం అధ్యక్షుడు గొడుగు హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు కొండబోయిన బాలచంద్రుడు అన్నారు. అహోబిలంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్రంలో ఆదివారం బెస్త ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అహోబిలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా జనవరి 13, 2025 నుంచి 15వరకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. గిరిబోయిన చిన్న లింగన్న, పుట్ట పెద్ద నరసింహుడు, కొండబోయిన తిరుపాలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.